# కాకుల్ని

వి.ఎమ్.ఎస్.స్వాతి



దాబాపై గుడ్డపరిచి తడిబియ్యం ఆరబోసి కొంచెం దూరంగా కుర్చీలో కూర్చుని చేతిలో న్యూస్ పేపరుతో బియ్యానికి కాపలా – పేపరు పఠనమూ ఏకకాలంలో నిర్వహించసాగాడు శివం.

రెండు కాకులు బియ్యం దగ్గర వాలి, అవురావురుమని బొక్కుతూంటే అలికిడికి తలెత్తి చూసిన శివం 'హుష్' అని చెయ్యి విసిరాడు. ఎగిరిపోయాయి కాకులు. అతను పేపర్లో తల దూర్చాడు.

కాసేపట్లో మళ్ళీ కాకులు.

హుష్.

కాకులు.

ష్....

చరిత్ర చర్వణంగా జరుగుతూంటే పాపం! విసిగిపోయాడు. చెట్టంత మనిషి ఎదురుగా ఉన్నాడన్న భయమూ లేదు వాటికి.

ఆ రోజు ఆఫీసుకు శెలవు కదాని, రిలాక్సింగ్ మూడ్‌తో పేపరు సాంతం పూర్తిచెయ్యాలనుకుంటే వీలైతేనా?

'వెధవ కాకుల్లారా! మీరు తినే నానా రొష్టూ చాలక మేం పవిత్రంగా తినే పదార్థాల్ని కలుషిత పరుస్తారేం, పాపిష్టి జన్మల్లారా....' తిట్టూ, ఇంకాసేపుంటే అవీ మిగిలేలా లేవని బియ్యం మూటకట్టి చేత బట్టుకుని దాబా దిగాడు.

ముఖం వేలాడేసుకొని వచ్చిన భర్త వాలకంలో వైఫల్యాన్ని అర్థంచేసుకున్నది పార్వతి 'మీరు పేపరూ చదవాలి, కాకుల్నీ తరమాలి అంటే సాధ్యమయ్యే పనేనా! నా అర్కం! మీకు చెప్పానే పని, పాపం! కష్టపడ్తారు తెస్తానుండండి బ్రూ కాఫీ........' నవ్వుతూ వంటగదిలోకి నడిచింది.

భార్యను వెంబడించాడు శివం,

'దీనికేం కొదువలేదు, ష్! పట్టపగలే. నాకు సిగ్గు బాబూ, అబ్బాయి ఏక్షణమైనా రావొచ్చు, చెప్తూంటే వినరేం....'

'పసివాడు, వాడికేం తెలుసు, అబ్బ! ఇటు తిరుగూ....'

వీధిలో ఆడుకొని అప్పుడేవచ్చిన వాళ్ళ పుత్రరత్నం, వంటగదిలో వ్యవహారం విని-




'నాన్న ఏ జంతికలో, లడ్డూలో అడుగుతూంటే అమ్మ ఇవ్వనంటూన్నట్లుంది. తనూ వెళ్తే తాయిలం దొరుకుతూందనే ఆశతో లోనికి దూసుకెళ్ళాడు, 'అమ్మా! నాకూ జంతిక ఒకటివ్వవే....' అంటూ.

అదే సమయాన భార్య ముఖంమీద వాలున్నాడు శివం. కొడుకు కంఠం వింటూనే ఇద్దరూ దూరదూరంగా జరిగారు.

పెరటికి వంటగది అనుకునే ఉంది. పట్టపగలే కాబట్టి ఎక్కడి తలుపులక్కడ తీసున్నాయి. ఒక కాకి రివ్వున ఎగురుతూ వచ్చి గోడకు దారంకట్టి వేలాడేసున్న ఉప్పంచులు (ఎండబెట్టిన మాంసం ముక్కలు) మీదికి రాబోయి మనుషుల అలికిడితో భయపడి వెనక్కి మళ్ళింది.

'ఓసి దొంగముండా! ఇది నీ పనా నేను వాడకుండానే ఉప్పంచులు చెల్లచెదురుగా ఉన్నాయేమా అనుకుంటున్నాను." పార్వతి విసుక్కుంది.

'అబ్బబ్బ! వీటితో వేగలేకున్నాను.. విసుక్కుంది.

'ఇక్కడేం చేస్తున్నావు నాన్నా?' అని కొడుకు అడిగితే అబద్ధమాడే అస్కారాన్ని ఇవ్వనిచ్ఛగించక 'బాబుకు కాఫీ ఇచ్చి ఓ కప్పు నాకూ పట్రా....' అంటూ గది దాటాడు శివం.

కావు....కావు...మని అరుస్తూ కాకుల గుంపొకటి వెళ్తూండటం శివం తన గది కిటికీలోంచి చూసి_

'ఎక్కడో కాకి చచ్చి పడుంది. సంతాపంగా గుంపు బయల్దేరాయి! మనుషుల నిత్యజీవితంలో వీటిల్తో వేగడమూ తప్పదు మరి....' అనుకున్నాడు.